19

పెరుగుదల మరియు అభివృద్ధి
(6-11 సంవత్సరాలు)

ముందు పాఠ్యాంశంలో అభివృద్ధి అనేది పుట్టుక నుండి వృద్ధాప్యం వరకు నిరంతరం జరిగే ప్రక్రియ అని తెలుసుకున్నారు. ఈ మానవాభివృద్ధి ముఖ్యంగా నాలుగు భాగాలుగా విభజించబడింది. బాల్యము, యవ్వనం, మధ్య వయస్సు, వృద్ధాప్యం అని చదువుకున్నారు. అంతేకాకుండా పిల్లల యొక్క అభివృద్ధిలో ముఖ్యమైన అంశాలను నేర్చుకున్నారు. ఈ పాఠ్యాంశంలో 6-11 సంవత్సరాల వయసు గల పిల్లల పెరుగుదల మరియు అభివృద్ధిపైన అవగాహన ఏర్పరచుకుంటారు.

లక్ష్యాలు (Objectives) :

ఈ పాఠ్యాంశం నేర్చుకొనిన తరువాత మీరు..

- శారీరక అభివృద్ధి గురించి తెలుసుకుంటారు.
- ఈ వయసులో జరిగే కండరాల అభివృద్ధి లక్షణాలను గుర్తించగలరు.
- సామాజిక - మానసిక అభివృద్ధికి, పిల్లవాడి ప్రవర్తనకు పోల్చుకోగలరు.
- పిల్లల యొక్క భాషాభివృద్ధి ఎలా ఉంటుందో విశదీకరించగలరు.
- పిల్లల మానసికాభివృద్ధి గుర్తించగలరు.

19.1 శారీరకాభివృద్ధి (Physical Development)

అబ్బాయిలు, అమ్మాయిలు ఒక్కసారిగా ఎత్తు పెరగటం గమనించి ఉంటారు. కానీ వారు వేరు వేరు వయసుల్లో ఎత్తు పెరుగుతారు. ప్రతి సంవత్సరం 2 1/2 - 3 నుంచి 10 సంవత్సరాల పిల్లలు (అబ్బాయిలు, అమ్మాయిలు) 5 నుండి 7 సెంటిమీటర్ల ఎత్తు మరియు 2-3 కిలోల బరువు పెరుగుతారు. 9-10 సంవత్సరాల వరకు మీ చుట్టు ప్రక్కల ఉన్న అమ్మాయిలు, అబ్బాయిల కన్నా తక్కువ ఎత్తు ఉండి తర్వాత అమ్మాయిలు ఆకస్మికంగా పెరగడం మీరు గమనించారా? ఎందుకంటే అమ్మాయిల ఎదుగుదల వేగం అబ్బాయిల కంటే ముందుగా మొదలవుతుంది. మరియు త్వరితంగా వారు ఎదగవలసిన ఎత్తు పెరుగుతారు.

11-13 సంవత్సరాల పిల్లలు ఆకస్మికంగా ఎత్తు - బరువు పెరగడాన్ని ఎదుగుదల వేగం అంటారు.

- ఈ క్రింది పట్టిక పిల్లలు మరియు యవ్వనస్తుల ఎత్తును బరువును సూచిస్తుంది (National Council of Health Statistics (NCHS) ప్రకారం)

వయస్సు (సం॥లో)	అబ్బాయిలు		అమ్మాయిలు	
	ఎత్తు సెం.మీ.	బరువు కిలోలు	ఎత్తు సెం.మీ.	బరువు కిలోలు
పుట్టినప్పుడు	50.5	3.3	49.9	3.2
3 నెలలు	61.1	6.0	60.2	5.4
6 నెలలు	67.8	7.8	66.6	7.2
9 నెలలు	72.3	9.2	71.1	8.6
1 సంవత్సరము	76.1	10.2	75.0	9.5
1.5 సంవత్సరము	82.4	11.5	80.9	10.8
2 సంవత్సరములు	85.6	12.3	84.5	11.8
3 సంవత్సరములు	94.9	14.6	93.9	14.1
4 సంవత్సరములు	102.9	16.7	101.6	16.0
5 సంవత్సరములు	109.9	18.7	108.4	17.7
6 సంవత్సరములు	116.1	20.7	114.6	19.5
7 సంవత్సరములు	121.7	22.9	120.6	21.8
8 సంవత్సరములు	127.0	25.3	126.4	24.8
9 సంవత్సరములు	132.2	28.1	132.2	28.5
10 సంవత్సరములు	137.5	31.4	138.3	32.5
11 సంవత్సరములు	140	32.2	142	33.7
12 సంవత్సరములు	147	37.0	148	38.7
13 సంవత్సరములు	153	40.9	155	44.0
14 సంవత్సరములు	160	47.0	159	48.0
15 సంవత్సరములు	166	52.6	161	51.4
16 సంవత్సరములు	171	58.0	162	53.0
17 సంవత్సరములు	175	62.7	163	54.0
18 సంవత్సరములు	177	65.0	164	54.4

19.1.1 శారీరక పరిమాణంలో మార్పులు (Change in body proportions) :



పటం 19.1 శరీర పరిమాణంలో మార్పులు

పసితనంలో మన తల శరీరంలో 1/4 వంతు పరిమాణంలో ఉంటుంది అనే విషయం మీకు తెలిసిందే. మరియు 6-8 సంవత్సరాలలో 1/6 వంతు ఉంటుంది. యుక్త వయస్సు వచ్చేసరికి శరీరం 1/8 వంతు పరిమాణానికి చేరుకుంటుంది. చెప్పాలంటే వయసు పెరిగే కొలదీ తల చిన్నదిగా అవుతుంది.

- మధ్య బాల్యంలో పెద్ద కండరాలు, చిన్న కండరాలు త్వరగా అభివృద్ధి చెందుతాయి.

19.1.2 దంతాలు, ఎముకలు, కండరాల అభివృద్ధి (Development of teeth, bones and muscles) :

1. దంతాలు:

మీరు గమనించినట్లయితే పిల్లవాడికి 3 సంవత్సరాలు వచ్చే సరికి 20 దంతాలు కలిగి ఉంటాడు. ఇవి పాల దంతాలు, పిల్లవాడు మధ్య బాల్యదశకు వచ్చే సరికి 28 దంతాలు కలిగి ఉంటాడు. వీటిని శాశ్వత దంతాలు అంటారు. వయసు వచ్చిన వారు 32 దంతాలు కలిగి ఉంటారు.

పటం 19.2 దంతాలు ఏర్పడుట

2. ఎముకలు (Bones) :

మధ్య బాల్య దశలో శరీరంలోని అన్ని ఎముకలు ఏర్పడతాయి. మరియు వాటి బలాన్ని, పరిమాణాన్ని అభివృద్ధి చేసుకుంటాయి. ఒకవేళ ఎముకల్లో కాల్షియం ఎక్కువైతే అవి పెళుసరిగా అయిపోయి సులభంగా విరిగిపోతాయి. మధ్య బాల్య దశలో ఎముకలకు తగినంత కాల్షియం ఉన్నట్లైతే అవి గట్టిగా ఉంటాయి. ఈ కారణం వలన మధ్య బాల్య దశలో పని సామర్థ్యత ఎక్కువగా ఉంటుంది. బలంగా ఉండే ఎముకలు కండరాలను ఉత్తేజపరుస్తాయి.

3. కండరాలు, కొవ్వు (Muscles and fat) :



పటం 19.3 ఎముకలు, కండరాలు వృద్ధి చెందుట

అన్ని ఎముకలు, కండరాలు క్రొవ్వుతో కప్పబడి ఉంటాయి. అమ్మాయిలకు ఎముకలు, కండరాల చుట్టూ క్రొవ్వు ఎక్కువగా ఉంటుంది. 7-8 సంవత్సరాల వయసులో అమ్మాయిలు కండరాల కన్నా క్రొవ్వును వారి యొక్క చేతులు, కాళ్ళు మరియు మొండెంలో కలిగి ఉంటారు. అబ్బాయిలు క్రొవ్వు కన్నా ఎక్కువ కండరాలను కలిగి ఉంటారు. ఇందువలన అబ్బాయిలు ఎక్కువ

బలాన్ని కలిగి ఉంటారు. అబ్బాయిలు ఎక్కువ దూరం పరుగెత్తగలరు మరియు ఎక్కువ ఎత్తు ఎగురగలరు.

పాఠ్యాంశంలోని ప్రశ్నలు 19.1

I. సరియైన సమాధానాన్ని గుర్తించండి.

1. మధ్య బాల్య దశలోని పిల్లల నోటిలోని దంతాల సంఖ్య?

   ఎ) 20 బి) 24 సి) 28 డి) 32

2. మధ్య బాల్య దశలోని పిల్లల శరీరంలో తల పరిమాణము ఎంత?

   ఎ) 1/8 బి) 1/6 సి) 1/4 డి) 1/2

3. శరీరంలోని అన్ని ఎముకలు ఎప్పుడు ఏర్పడుతాయి?

   ఎ) శైశవ దశ బి) పూర్వ బాల్యదశ సి) మధ్య బాల్య దశ డి) యవ్వన దశ

4. అబ్బాయిలు ఎక్కువ బలం కలిగి ఉండుటకు గల కారణం ఏమిటి?

   ఎ) ఎముకలు బి) కండరాలు సి) క్రొవ్వు డి) కాల్షియం

19.2 కండర చలన అభివృద్ధి (Motor Development)

6 నుండి 11 సంవత్సరాల పిల్లలు బడి అయిపోగానే వారు తరగతి గదుల నుండి బయటకు రావడం మీరు గమనించారా? అప్పుడు వారు ఏమి చేస్తారు? ఔను మీరు ఊహించింది నిజమే! కొంతమంది పరుగెడతారు, మరికొంత మంది ఎగురుతారు, మరి కొంత మంది ఇరుకు అంచులలో దుముకుతూ అటూ ఇటూ పడకుండా నిలకడగా ఉండగలరు. ఈ అన్ని పనుల వలన పిల్లలు వివిధ రకాల కదలికల కోసం వారి కండరాలను సమన్వయ పరుచుకోవటం నేర్చుకుంటారు.

శరీరం రెండు రకాల కండరాలు కలిగి ఉంటుంది. ఒకటి పెద్ద కండరాలు: చేతులు, కాళ్ళు, వెనుక భాగం మొదలైనవి మరియు చిన్న కండరాలు: చేతి వేళ్ళు, కాళ్ళ వేళ్ళు మొదలైనవి. కండరాల సంకోచము మరియు వంగే గుణం వలన కండరాలు పనిచేస్తాయని మీకు తెలుసనుకుంటాను. వివిధ రకాల కండరాలు వివిధ శరీర భాగాలలో ఉంటాయి. అవే శరీర భాగాలలో కొన్ని కండరాలు పనితనంలో వివిధ రకాల కదలికలను నియంత్రిస్తాయి. ఈ నియంత్రణ అనేది వాటంతట అదే నేర్చుకోబడుతుంది. కండరాల నియంత్రణ వలన జరిగే కదలికలను కండరాల సమన్వయం (muscular coordination) అంటారు.

కండరాల సమన్వయం రెండు రకాలు: చిన్నవి మరియు పెద్దవి. చిన్న కండరాల కదలికలను సన్నని కండరాల సమన్వయం అని, పెద్ద కండరాల కదలికలను పెద్ద కండరాల సమన్వయం అని అంటారు. పరుగెత్తడం, నిలకడత్వంగా ఉండటం, గెంతడం, పైకి ఎక్కడం అనేవి పెద్ద కండరాల సమన్వయం వలన జరుగుతుంది.

ఈ క్రింది విషయాన్ని పరిశీలించండి. ఒక పెన్సిల్‌ని చెక్క బల్లమీద ఉంచితే, ఒక సంవత్సరం పిల్లవాడు

పటం 19.4 పెద్ద కండరాల సమన్వయం

పెన్సిల్‌ను ఎలా పట్టుకుంటాడు? మూడు సంవత్సరాల పిల్లవాడు ఎలా పట్టుకుంటాడు? 11 సంవత్సరాల పిల్లవాడు ఎలా పట్టుకుంటాడు? మీరు ఎలా పట్టుకుంటారు?

మీరు గమనించినట్లయితే ఒక సంవత్సరం పిల్లవాడు, పెన్సిల్ పట్టుకోవడానికి తన అర చేయి మొత్తం ఉపయోగిస్తాడు. మరి 3సంవత్సరాల పిల్లవాడు పెన్సిల్ తీసుకోవడానికి, ఒకటి కన్నా ఎక్కువ వేళ్ళు మరియు బొటన వేలు ఉపయోగిస్తాడు. అదే సమయంలో 11 సంవత్సరాల పిల్లవాడు చూపుడు వేలు మరియు బొటనవేలు ఉపయోగిస్తాడు.

పటం 19.5 చిన్న కండరాల సమన్వయం

వేళ్ళు ఏ రకం కండరాలు కలిగి ఉంటాయి? పెద్దవా లేక చిన్నవా? స్పష్టంగా చిన్న కండరాలే. ఈ ఉదాహరణ వలన, మీరు చూసినదేమంటే చిన్న పిల్లవాడు పెద్ద కండరాలు ఉపయోగిస్తే అదే పనికి పెద్ద పిల్లవాడు చిన్న కండరాలను ఉపయోగిస్తారు. పిల్లవాడు పెరిగే కొద్దీ చిన్న కండరాల నైపుణ్యత సంపాదిస్తాడు. ఈ సమయంలో చిన్న కండరాల కదలికలు ఉపయోగించే చాలా పనులు వారికి బోధించవచ్చును. అంటే వ్రాయటం, రంగులు వేయటం, సూదితో చేసే పనులు మొదలైనవి.

మీరు ఇలాంటి కార్యక్రమాలు మరికొన్ని ఇవ్వగలరా?

మీకు ముందే తెలిసినట్లుగా పిల్లవాడు తినడం మరియు వ్రాయడం కన్నా ముందే నడవటం, పరుగెత్తడం, ఎగరడం, కొట్టడం నేర్చుకుంటారు. ఇది మీకు ఏమి తెలియజేస్తుంది? ఇది చిన్న కండరాల సమన్వయం కన్నా ముందే పెద్ద కండరాల సమన్వయం నేర్చుకుంటాడు అని తెలియచెపుతుంది.

సున్నితమైన సమయము (Sensitive period) :

పిల్లవాడి యొక్క కండరాలు అభివృద్ధి చెందకముందే పిల్లవాడిని ఆ పనిని చేయమంటే (కండరాలను ఉపయోగించి) ఏమి జరుగుతుంది? ఒక్కసారి ఆలోచించండి అవును, కండరాలు పూర్తిగా ఏర్పడకపోతే అవి దెబ్బతింటాయి. ఏ

కండరాలు ఎక్కువగా దెబ్బతినే అవకాశం ఉంది? అవును, చిన్న కండరాలు. ఈ కారణం వలన 4 1/2 నుండి 5 1/2 సంవత్సరాల కన్నా ముందు పిల్లవాడిని వ్రాయమని బలవంతం చేయకూడదు. ఒకటవ తరగతిలోనే అంటే 5-6 సంవత్సరాల వయసులో ఒక క్రమ పద్ధతిగల చదువు మొదలవుతుందని చిన్న కండరాలు మరియు వ్రాయటానికి అవసరమైన సమన్వయం చాలా వరకు పూర్తవుతుంది. 6-11 సంవత్సరాల వయసులో పిల్లవాడి యొక్క చేతివ్రాత మెరుగుపడుతుంది మరియు త్వరగా వ్రాయగలుగుతాడు. ఇది సున్నితమైన సమయము. ఒక పనిని చాలా అమోఘంగా నేర్చుకోవటానికి ఇది మంచి సమయం లాంటిది.

ఈ సున్నితమైన సమయములో శరీరం ఒక పనిని లేక నైపుణ్యాన్ని పూర్తిగా నేర్చుకోవటానికి సిద్ధంగా ఉంటుంది. ఈ సమయంలో పిల్లవాడికి ఒక పని చెయ్యటానికి అవకాశము మరియు ప్రోత్సాహం ఉన్నట్లయితే ఆ పనిని మరియు నైపుణ్యాన్ని అత్యుత్తమంగా నేర్చుకుంటాడు. 6-11 సంవత్సరాల పిల్లలు ఎక్కువ సంఖ్యలో వివిధ పనులను నేర్చుకుంటారు. వివిధ ఆటలు ఆడతారు. ఈ సమాచారం దేనిని సూచిస్తుంది? అనగా కండరాలు ఈ దశలో పరిపక్వము చెందుతాయి. ఈ క్రింది పట్టిక 6 -11 సంవత్సరాల పిల్లల కండరాభివృద్ధిని లేక కొన్ని పనులను సూచిస్తుంది.

వయసు	పరుగెత్తడం, తన్నటం బంతిని విసరటం	నిలకడగా ఉండటం	గెంతడం, దుముకడం, ఎగరడం
6 సంవత్సరాలు	బంతిని విసరగలరు	చాలా తక్కువ సమయం ఒక కాలిపై నిలబడగలరు	రెండు కాళ్ళతో గెంతగలరు
7 సంవత్సరాలు	అనుకున్న దూరానికి బంతిని విసరగలరు	తక్కువ సమయం ఒక కాలిపై నిలబడ గలరు	చతురస్రాకారంలో దుముకడం, ఎగురగలరు.
8 సంవత్సరాలు	చిన్న బంతిని అనుకున్న దూరానికి విసరగలరు	కొంచెం ఎక్కువ కాలం ఒక కాలుపై నిలబడగలరు	ఆటలు ఆడేటప్పుడు రెండు కాళ్ళతో ఒకదాని తరువాత ఇంకొకటి వాడటం, గెంతటం వంటివి చేస్తారు.
9 సంవత్సరాలు	చిన్న బంతిని ఎక్కువ దూరం కూడా విసురుతారు సమతుల్యంగా పరుగెడుతారు.	చాలా ఎక్కువ కాలం దుముకుతూ ఒక్క కాలిపై నిలబడగలుగుతారు	తన ఎత్తుకు సమానంగా ఎగురుతారు.
10 సంవత్సరాలు	బంతి ఎక్కడ వరకు వెళ్ళ గలదో నిర్ణయించి దాన్ని ఆడగలరు.	చాలా ఎక్కువ కాలం ఒక్క కాలిపై దుముకుతూ నిలబడతారు.	పరుగెడుతూ ఏర్పరచిన అడ్డుపై నుండి ఎగురుతారు.

పాఠ్యాంశంలోని ప్రశ్నలు 19.2

1. 'ఎ' విభాగంలో ఇచ్చిన కార్యక్రమాలను చదవండి. వయసు ప్రకారం పిల్లవాడు దేనిని ఎప్పుడు నేర్చుకుంటాడో వరుస క్రమములో 'బి' విభాగంలో వ్రాయండి. సంవత్సరాన్ని 'సి' విభాగంలో వ్రాయండి.

విభాగం 'ఎ'	విభాగం 'బి'	విభాగం 'సి'
i) చతురస్రాకారపు ఆకారంలో దూకడం, ఎగరడం	.....	.....
ii) రెండు కాళ్ళతో గెంతడం	.....	.....
iii) పరుగెత్తడం మరియు దాటడం	.....	.....
iv) తనంత ఎత్తుకు ఎగరటం	.....	.....

2. ఈ కార్యక్రమాలు మీరు కూడా రోజు చేస్తారు. చిన్న కండరాల సమమన్వయ పనులను పెద్ద కండరాల సమన్వయ పనులను వేరు చేయండి.

i) పెన్సిల్ చెక్కడం .....

ii) రోడ్డుపైన నడవడం .....

iii) ఆహారం చెంచాతో తినడం .....

iv) మెట్లు ఎక్కడం .....

v) పరుగెత్తడం మరియు ఆర్చును దాటడం .....

vi) చొక్కా గుండీలు పెట్టడం .....

19.3 భాషాభివృద్ధి (Language Development)

పిల్లల భాషాభివృద్ధిలో ఏమి జరుగుతుందో ఇప్పుడు మనం చూద్దాం.

8 సంవత్సరాల పిల్లలతో మీరు ఎప్పుడైనా మాట్లాడారా? పిల్లలకు ఎన్నెన్ని విషయాలు వారికి తెలుసు, వాటిని ఎలా వివరిస్తారో చూస్తే మీరు ఆశ్చర్యపోతారు. 6-11 సంవత్సరాల వయసు వరకు పిల్లలకు భాషపై పూర్తిగా పట్టు వస్తుంది. ఈ వయసు పిల్లలకు 14,000 నుండి 30,000 పదాలు తెలుసు. భాషను బాగా ఉపయోగించడం మరియు బాగా సంభాషించటంలో సామర్థ్యం పెంచుకుంటారు. ఈ వయసు వచ్చేసరికి పిల్లలు ఒక పదానికి చాలా అర్థాలు ఉంటాయని తెలుసుకుంటారు.

6-11 సంవత్సరాల పిల్లలు వాక్యాల నిర్మాణాన్ని బాగా అర్థం చేసుకుంటారు. ఒక పదానికి అనేక అర్థాలు

కాకుండా, పలకడంలో కొన్ని పదాలు ఒకే రకంగా ఉంటాయని మరియు వాటి అక్షరాలు వేరు వేరుగా ఉంటాయని తెలుసుకుంటారు. ఉదాహరణకు CORN అనగా ధాన్యము లేక గట్టిది అని అర్థము. చర్మముపై పెరిగిన HAIR మరియు HEAR లేక WHOLE మరియు HOLE, ఇవి కూడా వేరే అర్థాలే కాకుండా వేరే అక్షరాలు కూడా ఉన్నాయి. రూపాలంకారము మరియు కష్టంగా పలికే పదాలను ఉపయోగించడానికి పిల్లలు చాలా సంతోషపడతారు.

కొన్ని రూపాలంకారము (metaphors) :

- సూర్యునిలా ప్రకాశించు
- దాటే ముందు చూడు
- ఈకలాగ తక్కువ బరువు
- దయ్యానికి మరియు లోతైన సముద్రానికి మధ్యలో

కొన్ని నాలుక తరగని పదాలు (tongue twisters) :

- నాలుగు ఎర్ర లారీలు ఆరు తెల్ల లారీలు / నాలుగు తెల్ల లారీలు ఆరు ఎర్ర లారీలు.

రూపాలంకారాలతో మరియు నాలుక తిరగని పదాలతో పిల్లలు చాలా ఆనందపడటమే కాకుండా చమత్కారము గ్రహించే శక్తిని అభివృద్ధి చేసుకుంటారు. ఈ వయసు పిల్లలు ఎక్కువగా భాషలో దాగి ఉన్న నిగూఢమైన అర్థంపై హాస్యమాడతారు. పెద్దలకు ఇది తెలివి తక్కువగా అనిపించినా పిల్లలు మాత్రం వీటిని ప్రేమిస్తారు.

ఉదాహరణకు :

పటం 19.6 పిల్లల సంభాషణలో హాస్యము

అబ్బాయి. 1 – నీకు ఓ ఛండాలమైన హాస్యం చెప్పనా?

అబ్బాయి. 2 – చెప్పు

అబ్బాయి. 1 – ఒక అబ్బాయి బురదలో పడ్డాడు

అబ్బాయి. 2 – హా! హా!

అబ్బాయి. 1 – మరొకటి వింటావా?

అబ్బాయి. 2 – వింటాను

అబ్బాయి. 1 – ఒక అమ్మాయి బురదలో పడింది

అబ్బాయి. 2 – హ! హ! హ! హ!

19.4 సాంఘిక - ఉద్వేగాభివృద్ధి (Socio Emotional Development)

ముందుగా సాంఘికాభివృద్ధి అంటే ఏమిటో తెలుసుకుందాం! "సాంఘికాభివృద్ధి అనగా సమాజానికి అనుగుణంగా ప్రవర్తించడమే కాకుండా, అందరితో కలసిపోవడం, కలవిడిగా ఉండటం". ఉద్వేగాభివృద్ధి అంటే ఏమిటి? "ఉద్వేగాభివృద్ధి అనగా మన ఉద్వేగాలను నియంత్రణలో పెట్టుకోవడం మరియు వాటిని సమాజం ఒప్పుకునే విధంగా తెలియజేయటం."

సాధారణంగా ఈ రెండింటి నిర్వచనం ఏంటంటే సంఘంలో అనుమతించే విధంగా ప్రవర్తించడం . 6-11 సంవత్సరాల పిల్లలు ముఖ్యమైన భావోద్వేగాలన్నీ కల్గి ఉంటారు. ఈ వయస్సులో అన్ని భావోద్వేగాల మీద మంచి పట్టు సాధిస్తారు. అంతేకాకుండా పరిస్థితులకు అనుగుణంగా భావోద్వేగాలను సంఘం అనుమతించే విధంగా వ్యక్తపరుస్తారు. ఉద్వేగాభివృద్ధితో పాటుగా ఏకకాలంలో సాంఘికాభివృద్ధి కూడా జరుగుతుంది. కనుక దీనంతటిని కలిపి పిల్లల యొక్క సాంఘిక – ఉద్వేగాభివృద్ధి అంటారు.

మీకు తెలిసినట్టుగానే సాంఘికాభివృద్ధి అనగా పిల్లల ఇల్లు, స్నేహితులు, బడి మొదలైన పరిసరాలకు అనుగుణంగా వారి ప్రవర్తనని సరిచూసుకోవడం. దీని అర్థం ఏమనగా, తల్లిదండ్రులు, సమయవస్కులైన స్నేహితులు, తోటిపిల్లల సమూహము, బడిలోని ఉపాధ్యాయులు, పిల్లల సాంఘికాభివృద్ధిపైన ప్రభావం చూపుతారు. క్రింద ఇచ్చిన వివరణలో వీరు ఎలా ప్రభావం చూపుతారో మనం నేర్చుకోవచ్చు.

1. తల్లిదండ్రులు :

మధ్య బాల్య దశ వయసులో పిల్లలు ఆత్మవిశ్వాసం మరియు మనోధైర్యము సంపాదించటానికి అవకాశం ఉంది. తల్లిదండ్రులకు మనోధైర్యం ఉంటే వారి పిల్లలు మనోధైర్యం కలవారు అవ్వటానికి అవకాశాలను ఇస్తారు. పిల్లలను అంగీకరించి వారిని ప్రేమిస్తే పిల్లలలో మనోధైర్యాన్ని పెంచగలుగుతారు. అలాంటి తల్లిదండ్రులు పిల్లలకు సరియైన నియమాలు ఏర్పరచుతారు. పిల్లలు చేసే మంచి పనులను తల్లిదండ్రులు అభినందించి చేసే చెడ్డ పనులకు వారిని శిక్షించరు. పిల్లవాడు ఏదైనా చెడ్డపని చేస్తే అది ఎందుకు తప్పో వారికి అర్థమయ్యే విధంగా వివరిస్తారు. మరోమాటలో చెప్పాలంటే పిల్లల క్రమశిక్షణలో తల్లిదండ్రులుగా స్వేచ్ఛా పద్ధతిని అవలంబిస్తారు.

2. తోటి పిల్లల సమూహము (Peer group) :

ఒకే వయస్సుగల ఆడుకునే పిల్లలను తోటి పిల్లల సమూహముగా పరిగణించవచ్చును. వారు సాంఘిక – భావోద్వేగ అభివృద్ధిలో చాలా ముఖ్యమైన పాత్రలను పోషిస్తారు. ఉదాహరణకు అందరి తల్లిదండ్రులకు తమ పిల్లల పైన చాలా ఎక్కువ ఆశలుంటాయని పిల్లలందరికీ తెలుసు. ఒక పిల్లవాడు అబద్ధం చెబితే మిగతా పిల్లలు కూడా అలాగే ప్రవర్తించవచ్చు. అనగా ఈ సమూహము పిల్లలు ఇతరులతో పోల్చుకొనుటకు అవకాశం కల్పిస్తుంది. అంతేకాకుండా

తల్లిదండ్రులు అందరూ సలహాలు ఇస్తారని, ఆజ్ఞాపిస్తారని మరియు తిడుతారని ఈ సమూహం ద్వారా పిల్లలు తెలుసుకుంటారు. పిల్లలు వారికి నచ్చిన విధంగా తల్లిదండ్రులు చేయనివ్వరని కూడా తెలుసుకుంటారు. దీని వల్ల పిల్లవాడికి చాలా కోపం వచ్చి ఎదిరించాలన్న ఉద్దేశం, వారిపై అయిష్టం కలుగుతాయి. వారి స్నేహితులతో మాట్లాడినప్పుడు అందరి పిల్లల పరిస్థితి అలాగే ఉందని తెలుసుకుంటారు. పిల్లలందరూ తల్లిదండ్రుల మీద చాలా కోపంగా ఉంటారు, కానీ స్నేహితుల సమూహాల వలన అలా తల్లిదండ్రులకు ఎదురు తిరగకూడదని, కోపం ఉండకూడదనీ తెలుసుకుంటారు. కావున స్నేహితులు పెద్దలు ఇవ్వలేని ఓదార్పును, ఉద్వేగ భద్రతను ఇస్తారు. పిల్లలు తల్లిదండ్రులను ఎప్పుడు సంతోషంగా ఉంచాలని, స్నేహితుల నుండి నేర్చుకుంటారు. కాబట్టి పిల్లలు సంఘంలో ఎలా మెలగాలో కూడా నేర్చుకుంటారు. స్వతంత్రంగా ఎలా ఉండాలో నేర్చుకుంటారు.

ఈ క్రింది ఉదాహరణలో 10 సంవత్సరాల అబ్బాయిల మధ్య ఏమి సంభాషణ జరుగుతుందో చూద్దాం.

పటం. 19.7 ఒకే వయసు అబ్బాయిల మధ్య సంభాషణ

రాహుల్ తన చిన్న వయస్సులో అమ్మని విడిచి ఒక రాత్రి గడపటానికి చాలా భయపడ్డాడు. కానీ తరువాత భయపడటం చాలా సామాన్యమైన విషయం అనుకొన్నాడు.

కావున, మనం ఏమి చెప్పవచ్చంటే స్నేహితుల సమూహము.

- పిల్లవాడు తనను తాను ఇతరులతో పోల్చుకోవటానికి సహాయపడుతుంది.
- తల్లిదండ్రులు ఇవ్వలేని భద్రతను, ఓదార్పును ఇస్తుంది
- సంఘంలో ఎలా మెలగాలో నేర్పుతుంది.
- ఇతరుల మీద ఆధారపడకుండా స్వతంత్రంగా ఎలా ఉండాలో నేర్పుతుంది.

కృత్యము (Activity) 19.1 :

క్రింద ఇచ్చిన పదాలకు సరియైన అర్థాలను వ్రాయండి. మీరు సరియైన అర్థం కోసం నిఘంటువు సహాయం కూడా తీసుకోవచ్చును.

పదం	అర్థము
Corn	మొక్కజొన్న / ధాన్యము
Corn	కాలి మడమలో 'ఆన'
Weak	
Week	
Principle	
Principal	
Beer	
Bear	

3. పాఠశాల (School) :

సాంఘిక - ఉద్వేగాభివృద్ధిలో పాఠశాల కూడా ఒక ముఖ్యమైన పాత్రను పోషిస్తుంది. పిల్లల పనులను బాగా చేయటానికి ఉపాధ్యాయులు ప్రోత్సహిస్తారు. పిల్లలు మంచి పనులు చేస్తే పొగుడుతారు. అదేవిధంగా చెడ్డ పనులు చేయడం వలన కానీ, చెడు ప్రవర్తనకు గానీ తిడుతారు. తద్వారా పిల్లలు వృద్ధి చెందటానికి అన్నింటిలోనూ సహాయపడతారు. ఉదాహరణకు ప్రతి ఒక్కరు కూడా ఆటల్లో, కుట్టడంలో, చిత్రలేఖనంలో ప్రావీణ్యత కలిగి ఉండరు. ప్రతి ఒక్క పిల్లవాడు తరగతిలో మొదటి హోదాలో ఉండలేరు. కానీ ప్రతి పిల్లవాడు ఏదో ఒక సామర్థ్యం కలిగి ఉంటాడు. అందువలన ఉపాధ్యాయులు కూడా పిల్లలకు ఎందులో అయితే సామర్థ్యం ఉందో అందులో మంచి ప్రోత్సాహాన్ని ఇవ్వాలి. ముఖ్యంగా మనం గుర్తుంచుకోవలసింది ఏంటంటే సంఘంలో ఉపయోగపడే వ్యక్తులు అవ్వాలంటే మనోధైర్యం అనేది చాలా అవసరం.

పాఠ్యాంశంలోని ప్రశ్నలు 19.3

క్రింద ఇచ్చిన వాక్యాలు తప్పో, ఒప్పో తెలుపుతూ ఆ సమాధానానికి వివరణ ఇవ్వండి.

1) ఒకే రకంగా పలికే పదాలకు వేరు వేరు అర్థాలున్నా 6-11 సంవత్సరాల పిల్లలు పదాల మధ్య తేడాలు తెలియక తికమక పడతారు.

   వివరణ .....

2) మధ్య వయస్సు గల పిల్లలు కష్టమైన పదాలను పలకడానికి చాలా కష్టపడతారు.

   వివరణ .....

3) మనోధైర్యము గల తల్లిదండ్రులు, మనోధైర్యం గల పిల్లలను కలిగి ఉంటారు.

   వివరణ.....

4) తల్లిదండ్రులు పాటించే స్వేచ్ఛ, స్వాతంత్ర్యం వలన పిల్లలలో మనోధైర్యం ఏర్పడటానికి అడ్డుపడుతుంది.

వివరణ .....

5) స్నేహితులు భావోద్వేగ స్వాంతన ఇస్తారు.

వివరణ .....

6) స్నేహితులు పిల్లలను వారి తల్లిదండ్రుల మీద ఆధారపడేటట్లుగా చేస్తారు.

వివరణ .....

19.5 మానసికాభివృద్ధి (Cognitive Development)

పిల్లల ఆలోచనా సరళి, తర్కించుట / ఊహించుట, సమస్యలను పరిష్కరించగలగటాన్ని మానసికాభివృద్ధి అంటారు. మీరు ముందుగానే చదువుకున్నట్లుగా 2-7 సంవత్సరాల పిల్లలలో ఈ క్రింద ఇచ్చిన విభాగాలలో మానసికాభివృద్ధి జరుగుతుంది.

- వస్తువుల స్థిరత్వం
- ప్రాణం లేని వస్తువులకు మానవుని స్వభావము ఉన్నట్లు నమ్ముతారు.
- ఇతరుల దృక్పథాన్ని అర్థం చేసుకోలేకపోవటం.

మానసికాభివృద్ధిలో 6-11 సంవత్సరాల వయస్సు ఒక మలుపు తిరిగే సమయము. ఈ వయస్సులో పిల్లలు వాస్తవముగా ఆలోచిస్తారు. మానసికాభివృద్ధిలో మరి కొన్ని ముఖ్యమైన అంశాలు:

1. వాస్తవానికి మరియు కల్పనకి మధ్య ఉన్న తేడాలు తెలుసుకుంటారు (Differentiation between fantacy and reality) :

పూర్వ బాల్యదశలో పిల్లలకు కల్పనకి, వాస్తవానికి తేడాలు తెలియవు. 4సంవత్సరాల బాలుడు క్రిస్మస్ తాత నిజం అనుకుంటే 10 సంవత్సరాల బాలునికి అది కల్పితం. ఒక చిన్నపిల్లవాడు శిశువులను ఆసుపత్రి నుండి కొనుక్కు వచ్చారనుకుంటే, మధ్య వయుస్సులోని పిల్లవానికి ఆసుపత్రి నుండి కొనలేదని తెలుసు. ఇలాంటి ఉదాహరణలు మీరు ఇంకా చాలా చెప్పగలరు.

2. ఇతరుల దృక్పథాన్ని / ఆలోచనా విధానాన్ని అర్థం చేసుకుంటారు (Understanding another's point of view):

మనం ఒక ఉదాహరణ చూద్దాం. రోహన్ (5సం॥లు) వాళ్ళ అమ్మ వంట గదిలో ఉండి రోహన్‌ని ఒక ప్రశ్న అడిగింది. అప్పుడు ఇంకొక గదిలో ఉన్న రోహన్ తల ఊపి సరే అన్నాడు. తల ఊపడం (సమాధానం చెప్పడం) వాళ్ళ అమ్మ చూస్తుందని రోహన్ అనుకుంటాడు. అదే 8 సంవత్సరాల వయసులో రోహన్ వాళ్ళ అమ్మలాగ ఆలోచిస్తాడు. వేరే గదిలో ఉన్న వాళ్ళతో తను తల ఊపి సమాధానం చెబితే చూడలేరని తెలుసుకుంటాడు. మరో విధంగా చెప్పాలంటే

ఇతరుల ఆలోచనను అర్థం చేసుకోవడం లేక సానుభూతిగా మెలగడం తెలుస్తుంది. ఇలా అర్థం చేసుకోకపోవడాన్ని "నేను నేననుకోవటం" లేక 'అహంకారము' అంటారు. సానుభూతి చూపటం ఈ వయసులో మొదలై పిల్లవాడు పెరిగే కొలదీ మెరుగు పడుతుంది.

3. ఒక దానిని మరొకదానిగా మార్చగల సామర్థ్యం (Reversibility) :

ఇప్పుడు మనం ఒక పని చేద్దాం. మట్టితో చేసిన ఒక బంతిని 4 సంవత్సరాల పిల్లాడికి చూపించండి. దానితో ఒక పరుపును తయారు చేయండి. దాన్ని పిల్ల వాడికి చూపించండి. ఇప్పుడు అదే మట్టితో ఒక పాముని చేయండి. ఇప్పుడు దానిని పిల్లవాడికి ఇచ్చి మళ్ళీ పరుపును తయారు చేయమనండి. అప్పుడు ఆ పిల్లవాడు తన బలహీనతను తెలుపుతాడు.

దీని వల్ల మళ్ళీ తిరిగి ఇంకొక రూపాన్ని చేయడంలో పిల్లవాడు ఇబ్బందిపడటం తెలుస్తోంది. మధ్య బాల్యదశ వయస్సు పిల్లలలో ఈ నైపుణ్యత మెల్ల మెల్లగా అభివృద్ధి చెందుతుంది. 11 సంవత్సరాలు వచ్చే సరికి ఒక రూపాన్ని మరొక రూపంలా మార్చగలగడంలో పూర్తిగా నైపుణ్యాన్ని సాధిస్తారు. ఇలా వెనక్కి ఆలోచించి సాధించడాన్ని రూపాంతరాలు అంటారు.

4. భౌతిక స్వభావములు మార్చలేమని నమ్మడం: మార్చలేనిది (Conservation) :

ఇప్పుడు మనం ఇంకో పని చేద్దాం. ఒక పది నాణాలను తీసుకొని రెండు వరుసలలో అమర్చండి. ఒక వరుస నాణాలను దగ్గర దగ్గర అమర్చండి. మరొక వరుస నాణాలను దూరం దూరంగా అమర్చండి. ఇప్పుడు 4సంవత్సరాల పిల్లవాడిని ఏ వరుసలో ఎక్కువగా నాణాలు ఉన్నాయో అడగండి. పొడవు ఎక్కువగా ఉన్న వరుసలో ఎక్కువ నాణాలు ఉన్నాయని చెబుతాడు. కానీ 8 సంవత్సరాల అబ్బాయి / అమ్మాయి చూసిన వెంటనే సరియైన సమాధానం చెబుతారు. ఎందుకంటే వారికి భౌతిక స్వభావములు, మనం దూరంగా పెట్టినా, దగ్గరగా పెట్టినా మార్చలేమన్న విషయం అర్థమవుతుంది.

భౌతిక స్వభావాలను పిల్లలు ఎలా అర్థం చేసుకుంటారో తెలుసుకోవడానికి ఇప్పుడు మనము ఒక చిన్న ప్రయోగం చేద్దాం. 4 సంవత్సరాలు మరియు 9 లేక 10 సంవత్సరాల పిల్లలను ఆహ్వానించండి. చల్లటి కూల్‌డ్రింక్‌ని రెండు సీసాలతో తీసుకోండి. రెండు గ్లాసులని తీసుకోండి. అందులో ఒకటి పొడవుగా, సన్నగా ఉండాలి మరొకటి వెడల్పుగా, పొట్టిగా ఉండాలి. ఆ రెండు సీసాల్లోని కూల్‌డ్రింక్‌ని ఆ రెండు గ్లాసులలో పోయండి. సన్నగా ఉన్న గ్లాసులో డ్రింక్ ఎక్కువ ఎత్తుగా ఉన్నట్టు, వెడల్పుగా ఉన్న గ్లాసులో డ్రింకు తక్కువగా ఉన్నట్టు కనిపిస్తుంది. పిల్లవాడు చూసేటప్పుడు కూల్‌డ్రింక్‌ని గ్లాసుల్లో పోయడం మర్చిపోకండి. ఇప్పుడు మీరు పిల్లలను చెరొక గ్లాసు తీసుకోమనండి. ముందుగా చిన్నపిల్లవాడిని ఒక గ్లాసు తీసుకోమనండి. ఖచ్చితంగా వాడు పొడువుగా ఉన్న గ్లాసును పట్టుకుంటాడు. ఎందుకంటే అందులో ఎక్కవ డ్రింకు ఉంటుందని అనుకుంటాడు. కానీ 10 సంవత్సరాల పిల్లవాడు, గ్లాసులు ఒకటి పొడవుగా ఉన్నా మరొకటి పొట్టిగా ఉన్నా రెండింటిలో ఉన్న డ్రింకు శాతం సమానమే అని అర్థం చేసుకుంటాడు.

భౌతిక లక్షణాలు కలిగియున్న కొన్ని వస్తువులు ఎప్పుడూ అదే విధంగా ఉంటాయని, చూడటానికి బయటకు వేరే విధంగా కనిపించినా అర్థం చేసుకునే సామర్యాన్ని 'మార్చలేనిది' (Conservation) అంటారు.

5. విభజించుట (Classification) :

మీరు ఆడుకునే పేక ముక్కలను చూసే ఉంటారు. వాటిని మీరు ఎన్ని విధాలుగా విభజించగలరు? ఇలాంటి ప్రశ్న నాలుగు సంవత్సరాల పిల్లలను అడిగితే ఒక్క రంగుల ఆధారంగా మాత్రమే విభజిస్తారు. అదే 9 నుంచి 10 సంవత్సరాల పిల్లలు వాటిని చాలా విధాలుగా విభజించుతారు. కావున మనం గమనించేదేమంటే మధ్య బాల్య దశ వయస్సులో పిల్లలు వస్తువులను అనేక రకాలుగా విభజించవచ్చని తెలుసుకుంటారు.

6. వరుస క్రమము (Seriation) :

ఒక 5సంవత్సరాల అమ్మాయిని, 10 సంవత్సరాల అమ్మాయిని ఒక చిన్న పొడుపు కథను అడిగి చూద్దాం. ఇక్కడ ముగ్గురు అక్కా చెల్లెల్లు ఉన్నారు వారు ఎ, బి మరియు సి. ఎ అనేది బి కంటే పొడువు. మరియు బి అనేది సి కంటే పొడవు కావున ఎ అనేది సి కంటే పొడవా లేక పొట్టా? దీనికి 5సంవత్సరాల అమ్మాయి సమాధానం చెప్పలేదు కానీ 10 సంవత్సరాల అమ్మాయి మాత్రం సరియైన సమాధానం చెప్పడమే కాకుండా దానిని వివరిస్తుంది. దీనిని మెదడులో అర్థంచేసుకోవడం అంటారు. అనగా ఎ>బి (ఎ,బి, కంటే ఎక్కువ) మరియు బి> సి (బి, సి కంటే ఎక్కువ), కావున ఎ>సి లేక సి<ఎ (ఎ,సి కంటే ఎక్కువ లేక సి, ఎ కంటే తక్కువ). వస్తువులను వరుస క్రమంలో అమర్చడాన్ని వరుస క్రమ సామర్థ్యం అంటారు.

7. సమయం మరియు వేగం (Time and Speed) :

10 -11 సంవత్సరాల అమ్మాయికి సమయము మరియు వేగం గురించి ఒక అవగాహన ఉంటుంది. ఆమె గడియారం చూసి సమయం కూడా చెప్పగలదు. అలాగే త్వరగా, ఆలస్యంగా, వేగంగా, మెల్లిగా, ఇప్పుడు, తరువాత అన్న వాటిని అర్థం చేసుకుంటుంది. అదే విధంగా వేగం గురించి కూడా తెలుసుకుంటుంది. 60 కిలోమీటర్ల వేగంతో వేళ్ళే కారు 40 కిలోమీటర్ల వేగంతో వెళ్ళే కారు కన్నా ముందుగా గమ్యం చేరుకుంటుందని చెప్పగలదు.

మధ్య బాల్య దశ వయసు పిల్లల మానసికాభివృద్ధికి సంబంధించిన లక్షణాలను సంగ్రహంగా మీరు చెప్పగలరా! ఒక్కసారి ఈ క్రింది పట్టికను చూడండి.

మధ్యబాల్య దశ వయస్సు పిల్లల మానసికాభివృద్ధి లక్షణాలు:
- కల్పితం మరియు వాస్తవంపై అవగాహన (Concept of fantacy and reality)
- నేనునేననుకునే అహంకారము (Empathy, Egocentrism)
- మార్చగల సామర్థ్యం (Reversibility)
- భౌతిక ఆకృతులను మార్చలేమని తెలియడం (Conservation)
- విభజించటం (Classification)
- వరుసక్రమంలో అమర్చటం (Seriation)
- సమయం మరియు వేగం గురించి అవగాహన ఉండటం (Concept of time and speed).

అన్ని అభివృద్ధుల లాగానే మానసికాభివృద్ధి కూడా అనువంశికత మరియు పరిసరాలపైన ఆధారపడి ఉంటుంది. ఒక మనిషి పుట్టుకతోనే కొన్ని తెలివితేటలతో పుడతాడు. కానీ ఆ తెలివిని ఎంతవరకు ఉపయోగించుకుంటాడు అనేది

పుట్టిన తరువాత అతని సామర్థ్యాలపై ఆధారపడుతుంది. ఒకవేళ అమ్మాయి వ్రాసిన పదాలను చూడకపోతే అసలు వారికి ఆ పదాల అర్థం అనేదే తెలియదు కదా? ఒకవేళ అమ్మాయికి వస్తువులను అమర్చే అవకాశం లేకపోతే ఆమె వస్తువులను అమర్చడం ఎలా తెలుసుకొంటుంది? చుట్టు ప్రక్కల వాతావరణం అమ్మాయికి అలాంటి పనులు చేయటానికి అవకాశాలు కల్పించి ఆమె మేధాశక్తిని పెంచటమే కాక అవసరమైనప్పుడు వాడుకునే సామర్థ్యాన్ని కలుగజేస్తుంది. ప్రతి పిల్లవాడిని సమృద్ధికరమైన, ఉత్తేజకరమైన వాతావరణంలో పెరగనివ్వాలి.

అన్ని అభివృద్ధులు ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉంటాయని గుర్తించుకోండి. పిల్లవాడు ఆరోగ్యంగా ఉంటే పనిచేయటానికి, నేర్చుకోవటానికి శక్తి ఉంటుంది. అబ్బాయి / అమ్మాయి వారి అభివృద్ధికి సంతోషంగా ఉండటమే కాకుండా వారి స్నేహితులతో సత్సంబంధాలు కలిగి ఉంటారు. అనారోగ్యం కలవారైతే తక్కువ శక్తి కల్గి, చిరాకుగా ఎప్పుడూ విసుగుగా ఉండటం వల్ల, తద్వారా తక్కువ మంది స్నేహితులను కలిగి ఉంటారు.

పాఠ్యాంశంలోని ప్రశ్నలు 19.4

1. క్రింద ఇచ్చిన తారుమారు అక్షరాలను ఉపయోగించి ఇది ఏ మానసికాభివృద్ధి లక్షణమో కనుగొనండి.
   1) సీమ నీటి సీసాలను వాటి ఎత్తు ప్రకారం అమర్చింది.
      (సక్రమవమురు) .....
   2) శంకర్ ఆరు గోళాలతో వివిధ రకాల ఆకారాలను చేయటానికి ప్రయత్నిస్తున్నాడు.
      (జించుటచువి) .....
   3) రాధిక వాళ్ళ అమ్మతో ఇప్పుడు టీ.వి. చూడనని గట్టిగా అరచి చెప్తోంది.
      (తినుభూసా) .....

2. 1) ఏ వయస్సు పిల్లవాడు ఎ,బి,సి లను పెరిగే క్రమపద్ధతి (ascending order) లో అమరుస్తారు?
      ఎ) 3సం॥ల వయస్సు బి) 5సం॥ల వయస్సు
      సి) 6సం॥ల వయస్సు డి) 10 సం॥ల వయస్సు
   2) ఏ వయస్సులో పిల్లవాడు గంటకి 50మైళ్ళ వేగంతో కారు, గంటకి 40మైళ్ళ వేగంతో వెళ్తున్న కారు కంటే గమ్యాన్ని ముందుగాచేరుతుంది అని చెప్పగలడు?
      ఎ) 3సం॥ల వయస్సు బి) 5సం॥ల వయస్సు
      సి) 6 సం॥ల వయస్సు డి) 10 సం॥ల వయస్సు
   3) 9సం॥ల పిల్లవాడు చెట్టు ఆకులని ఎన్ని విధాల ఆకృతులుగా చేయగలడు?
      ఎ) ఒకే విధంగా బి) రెండు విధాలుగా
      సి) పది విధాలుగా డి) చాలా విధాలుగా
   4) వాస్తవానికి, కల్పితానికి పిల్లలు ఎప్పుడు తేడా తెలుసుకుంటారు?
      ఎ) 3సం॥ల వయస్సులో బి) 5సం॥ల వయస్సులో
      సి) 3-5సం॥ల మధ్య వయస్సులో డి) 6-11సం॥ల మధ్య వయస్సులో

19.6 మీరు ఇంతవరకు నేర్చుకున్న విషయాలు (What you have Learnt)



పాఠ్యానంతర ప్రశ్నలు (Terminal Exercises)

1. శారీరక మరియు కండర చలన అభివృద్ధి మధ్య బాల్య వయస్సు పిల్లలలో, పూర్వ బాల్య దశ పిల్లలలో ఏవిధంగా తేడాగా ఉంటుందో వివరించండి.
2. 8సం॥ల పిల్లవాడి సాంఘిక-ఉద్వేగాభివృద్ధి, నాలుగు సం॥ల పిల్లవాడి కంటే ఏ విధంగా తేడాగా ఉంటుందో ఉదాహరణలతో వివరించండి.
3. 10 సం॥ల పిల్లలలో భాషాభివృద్ధి ఎలా ఉంటుందో పూర్తి వివరాలు ఇవ్వండి.
4. 11సం॥ల పిల్లలలో మేధాశక్తి యొక్క లక్షణాలు ఏమిటి?

పాఠ్యాంశ ప్రశ్నలకు సమాధానములు (Answers to Intext Questions)

19.1 I. (1) సి (2) బి (3) సి (4) బి

19.2 1. (i) 7సం॥ల వయస్సు (ii) 6సం॥ల వయస్సు

(iii) 10సం॥ల వయస్సు (iv) 9 సం॥ల వయస్సు

2. చిన్న కండరాల సమన్వయం - i, iii, iv

పెద్ద కండరాల సమన్వయం - ii, vi, v

19.3. 1) తప్పు, 6-11సం॥ల పిల్లలు పదాల మధ్య తేడాలు చెప్పడం కాకుండా వాటిని ఉపయోగిస్తూ సంతోషపడతారు.

2) తప్పు , కష్టమైన పదాలను పలుకుతూ పిల్లలు ఆనందిస్తారు.

3) ఒప్పు, మనోధైర్యం గల తల్లిదండ్రులు వారి పిల్లలలో మనోధైర్యం పెంపొందించడానికి స్వేచ్ఛ చాలా అవసరం.

4) తప్పు, అది పిల్లలలో మనోధైర్యాన్ని పెంచుతుంది.

5) ఒప్పు, ఎన్నో విషయాలు ఇతరులు కూడా అదేవిధంగా ఆలోచిస్తారని వారికి తెలుసు.

6) తప్పు, వారు వారి అనుభవాల ద్వారా తెలుసుకొని నెమ్మదిగా స్వతహాగా నేర్చుకుంటారు.

19.4 1 1) వరుస క్రమము 2) విభజించుట

3) సానుభూతి

2 1) ఎ 2) డి 3) సి 4) సి

వీడియో - మధ్య బాల్యదశలో మానసికాభివృద్ధి